కథా కౌముది



# అన్నార్తుడు

జయంతి సత్య శీల యాజి

మే నెల. మధ్యాహ్నం 12 గంటలు అవుతోంది. బయట మండే ఎండ.

అప్పుడే భోంచేసి గిన్నెలన్నీ సర్ది వంటింటి గడప మీద తల పెట్టుకుని పడుక్కోబోతున్నారు సుభద్రమ్మ గారు. ఇంతలో వీధి తలుపు కొట్టిన శబ్దం విని లేచి వెళ్ళి తలుపు తీసారు. గుమ్మం బయట ఎండలో నుంచుని ఉన్నాడు అతను.

కొంచెం మాసిన బట్టలు, దుమ్ము పట్టిన జుట్టు, మాసిన గడ్డం. భుజం మీద వేళ్ళాడుతున్న సంచీ.

"అమ్మగారూ, గుర్తు పట్టారా, నేను రవినండి, శంకరం స్నేహితుణ్ణి"

"అవునా, ఎండలో వచ్చావు. ఎమైనా పని మీద వచ్చావా ?"

"నేను శంకరం స్కూల్లో కలిసి చదువుకునేటప్పుడు మీ ఇంటికి వస్తూండే వాడినండి. మేము కాలేజీకి వెళ్ళిన తరువాత, రావడం తగ్గి పోయిందండి. ఈ మధ్యనే టౌనుకెళ్ళినప్పుడు శంకరాన్ని కలిసానండి. మిమ్మల్ని ఒకసారి చూసి రమ్మన్నాడండి. అందుచేత వచ్చానండి"

ఎన్నో సార్లు ఆకలిని చూసిన కళ్ళు. అతన్ని గుర్తు పట్టలేదు కాని అతని కళ్ళల్లో ఆకలిని చూడగానే గుర్తు పట్టారు ఆవిడ.

"అలాగా, మంచిది. ఎండపడి వచ్చావు, లోపలికి రా, భోంచేసి వెళ్దువు గాని"

అతను లోపలికి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

సుభద్రమ్మ గారు లోపలికి వెళ్ళి మంచి నీళ్ళు తీసుకొచ్చి ఇచ్చారు. బాగా ఎండపడి వచ్చాడేమో, బాగా చెమటలు కారుతున్నాయి.

"స్నానం చేస్తావా బాబూ, కొంచెం సేద తీరుతుంది"

"సరేనమ్మా"

"బావి దగ్గిర స్నానం చేసిరా బాబూ, ఇంతలో వంట అయిపోతుంది" లోపల్నించి తీసుకొచ్చి అతని చేతికి తువ్వాలు పంచ ఇచ్చి వంటిట్లోకి వెళ్ళారు సుభద్రమ్మ గారు.
అతను పెరట్లోకి వెళ్ళి స్నానం చేసి వచ్చేటప్పటికి కంచంలో భోజనం రెడీగా వుంది.

భోజనం ప్రారంభించాడు అతను. అతను శంకరం స్కూల్లో చదివేటప్పటి సంగతులు చెప్తూ భోజనం పూర్తి చేసాడు. కొసరి కొసరి వడ్డించారు ఆవిడ. భోజనం చేసి తృప్తిగా లేచి చేతులు కడుక్కున్నాడు అతను.

"బయట బాగా ఎండగా వుంది. కొంచెం సేపు పడుక్కుని ఎండ తగ్గిన తరువాత వెళ్ళు. వీధి గదిలో మంచం ఉంది. అక్కడ పడుక్కో"

"సరేనమ్మా" అతను వెళ్ళి మంచం మీద పడుక్కోగానే ఒళ్ళు తెలియనంతగా నిద్ర పట్టేసింది.

అతను లేచేటప్పటికి సాయంత్రం 5 గంటలయ్యింది.

"కొంచెం టీ తాగుతావా బాబూ ? "

అతను తలదించుకుని మెల్లిగా అన్నాడు.

"చిన్న తప్పు చేసానమ్మా. నేను శంకరాన్ని కలవలేదు. రెండు రోజుల్నించి ఏమీ తినలేదు. బాగా ఆకలిగా వుంది. చిన్నప్పుడు ఎప్పుడు ఆకలిగా ఉన్నా మీ ఇంటికి తీసుకొచ్చేవాడు శంకరం. ఈ ఇంట్లో ఎన్నో సార్లు భోజనం చేసాను. భోజనం దొరుకుతుందేమో అని వచ్చాను. అడగడానికి సిగ్గేసింది. అందుచేత అబద్ధం ఆడేను. క్షమించండి" అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అది చూడనట్లే ఆవిడ అన్నారు.

"ఫరవాలేదు బాబూ. ఆకలికి మించిన కష్టం ఎముంటుంది ?"

సుభద్రమ్మ గారు ఇచ్చిన టీ తాగుతుంటే, సుభద్రమ్మ గారు లోపల్నించి పేంటు, షర్టు తీసుకొచ్చి, "ఇవి వేసుంకుంటావా, శంకరానివి. వాడెప్పుడూ వాడలేదు " అని అతనికి ఇచ్చారు. ఆవి వేసుకుని బయల్దేరబోతూ "ఆమ్మ గారు, మంచి భోజనం పెట్టి ఆకలి తీర్చారు. చాలా కృతజ్ఞుణ్ణి, ఇంక బయలుదేరతాను" అన్నాడు అతను. అతని చేతిలో కొంచెం డబ్బు పెట్టి "రాముడు చల్లగా చూస్తాడు, వెళ్ళిరా" అన్నారు ఆవిడ.

అతను నమస్కారం పెట్టి బయలుదేరి గేటు తీయ్యబోతుంటే పని మనిషి రత్తాలు ఎదురు వచ్చింది. "నేను వేస్తాలే బాబు గారు" అని అతను వెళ్ళిన తరువాత గేటు వేసి పెరట్లోకి వెళ్ళింది రత్తాలు.

"శంకరం బాబు గారి స్నేహితులా అమ్మ గారు ?" సుభద్రమ్మ గారు వేసిన గిన్నెలు కడుగుతూ అడిగింది రత్తాలు.

"అవునే. వాడి స్కూల్లో స్నేహితుడట. మనింటికి వచ్చేవాడట. నాకెప్పుడూ చూసిన జ్ఞాపకం లేదు"

"మిమ్మల్ని చూడ్డానికి వఛ్చారా "

"అవునే, ఆకలితో ఉన్నాడు పాపం. కొంచెం అన్నం తిని వెళ్ళాడు."

"మరి మీరెప్పుడూ చూడలేదన్నారు ?"

"శంకరంతో ఎంతో మంది వచ్చేవారు, గుర్తుండదే"

"అసలు ఇతను శంకరం బాబు గారి స్నేహితుడు అవునో కాదో. మీ ఇంట్లో ఎప్పూడు అన్నం దొరుకుతుందని ఈ వూరు అందరికీ తెలుసు గదా. ఇతను ఎక్కడో విని అలాగే బాబు గారి పేరు చెప్పి మీరు పెట్టిన అన్నం తినిపోవడానికి వచ్చి వుంటాడు. అయినా ఇది మరీ చోద్యం అమ్మ గారు, వాళ్ళు నిజం చెప్తున్నారో లేదో చూడొద్దా. వాళ్ళు ఏమైనా చేస్తే ? "

"పట్టెడన్నం పెట్టడానికి పుట్టెడు ప్రశ్నలెందుకే ? అతని మొహంలో ఆకలి కనిపించింది, పాపం ఏ తల్లి కొడుకో, అన్నం పెట్టాను. అన్నం మీద మొదటి అర్హత కేవలం అకలిదే అనేవాడు శంకరం "

కొంచెం సేపు ఇద్దరూ శంకరం జ్ఞాపకాల్లో మునిగిపోయారు. తరువాత రత్తాలు తనలో అనుకుంటున్నట్లుగా మెల్లిగా అంది.

"ఆకలి అసలు చూడలేకపోయేవారు బాబు గారు. పాపం ఎవరు అకలిగా ఉన్నారు అనిపించినా విలవిలలాడిపోయేవారు."

"అమ్మంటే ఆకలిని గుర్తుపట్టడమే అనేవాడు... పిచ్చితండ్రి. అందుచేతే దేవుడికి అంత ఇష్టమయిందేమో, అప్పుడే తీసుకెళ్ళిపోయాడు." సంవత్సరం క్రితం పోయిన కొడుకు గుర్తొచ్చి ఆవిడ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పమిట చెంగుతో తుడుచుకున్నారు.

వాడిపోయిన సుభద్రమ్మగారి శరీరంలో వాడని ఆవిడ మంచితనం చూసి రత్తాలు కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి. రత్తాలు అవి తుడుచుకోలేదు.

(అమ్మ అంటే ఏమిటో చెప్పిన (జిల్లెళ్ళమూడి) అమ్మకు అంకితం.)

COMMENTS